క్లుప్తంగా...

విధుల్లోకి నలుగురు నూతన ఎస్‌ఐలు

పోచారం: పోచారం పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నలుగురు ఎస్‌ఐలు విధుల్లో చేరారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి ఎ.కృష్ణయ్య, నాగోల్ పోలీస్ స్టేషన్ నుంచి బి.నాగార్జునరెడ్డి, ఘట్‌కేసర్ పీఎస్ నుంచి డి.జ్ఞానేందర్‌రెడ్డి, బి.రాము బదిలీపై పోచారం పీఎస్‌కు వచ్చారు.

బోనాల పండగకు అమ్మవారి ఆలయం సిద్ధం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్‌ఎఫ్‌సీనగర్ దత్తాత్రేయనగర్‌లో బోనాల పండగకు బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. దాతలు శివ రంగులు వేయించగా, వేణు షెడ్డు వేయించారు. ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మేడ్చల్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని నల్ల పోచమ్మ ఆలయానికి 16వ వార్డు కౌన్సిలర్ ఉమానాగరాజు మైక్ సెట్‌ను విరాళంగా అందజేశారు. ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులకు పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శివకుమార్, కమిటీ సభ్యులు వెంకటేష్, అంజయ్య దేవ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మేడ్చల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా రాములు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వి.రాములు నియమితులయ్యారు. మేడ్చల్ కమిషనర్‌గా పనిచేస్తున్న త్రిలేశ్వర్‌రావు అనారోగ్యం కారణంగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో మున్సిపల్‌శాఖ గుండ్లపోచంపల్లి కమిషనర్ రాములుకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆయన మేడ్చల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఓబీసీ సెల్ వైస్ చైర్మన్‌గా రమేష్



నియామక పత్రాలను అందజేస్తున్న మహేష్‌గౌడ్

పోచారం: కాంగ్రెస్ ఓబీసీ సెల్ పోచారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా పల్లపు రమేష్, కన్వీనర్‌గా శాంత కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాలను బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యకర్తలందరూ ఐక్యతతో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఇద్దరి సస్పెన్షన్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండలం సీసీ సరిత, కీసర గ్రామ పంచాయతీ పరిధిలోని కీసర–3 గ్రామ సంఘం వీఏఓ లావణ్యను సస్పెండ్ చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి పద్మజారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నిధులు దుర్వినియోగం చేసినందుకు వీరిపై చర్యలు తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. డీపీఎం, ఐబీ విచారణ ఆధారంగా కీసర–3 గ్రామ సంఘం వీఏఓ లావణ్య తన సంఘమైన నటరాజ్ సంఘం సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.లక్ష డ్రా చేయగా, ఈ డబ్బులను కీసర మండలం సీసీ సరిత తన అవసరాల కోసం వినియోగించుకొని తిరిగి చెల్లించినట్లు పద్మజారాణి తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



పోచారం: నారపల్లి సమీపంలోని ఓయూ కాలనీకి చెందిన మహిళ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న స్వప్నను చికిత్స కోసం భర్త రాజు గాంధీ ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతున్న ఆమె మరణించడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

పంచాయతీ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం



మేడ్చల్‌లో దీక్షలో కూర్చున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు కాంగ్రెస్ నాయకులు తమ సంఘీభావం ప్రకటించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని గ్రామ పంచాయతీ కార్మికుల దీక్షా శిబిరం వద్దకు టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్లి కార్మికులతో కలిసి దీక్షలో పాల్గొన్నారు. పంచాయతీల్లో కార్మికులు అరకొర జీతాలతో ఎన్నో సేవలు అందిస్తున్నా వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

బీఎస్పీ నాయకుల సంఘీభావం

సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు బీఎస్పీ మండల నాయకులు సంఘీభావం ప్రకటించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని గ్రామ పంచాయతీ కార్మికుల దీక్షా శిబిరం వద్దకు నాయకులు వెళ్లి కార్మికులతో కలిసి దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జంగయ్య, రవీందర్, మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు బీజేపీ నేతల మద్దతు

కీసర: కీసర మండల పరిషత్ కార్యాలయం వద్ద వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న సమ్మెకు బీజేపీ నేతలు మద్దతు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నల్ల వెంకట్‌రెడ్డి, బండారి శ్రీనివాస్ రెడ్డి, మెట్టు కృష్ణాయాదవ్, చంద్రమౌళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ నేతలు

ఘట్‌కేసర్: అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు అధ్యక్షతన మంగళవారం సంఘీభావం తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, సర్పంచ్ కావేరి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, మహిపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రఘు, ప్రవీణ్‌రెడ్డి, బస్వరాజ్, మశ్చేందర్‌రెడ్డి, రాజుముదిరాజ్, లాలయ్య, ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.



కీసరలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నేతలు



ఘట్‌కేసర్‌లో సంఘీభావం తెలుపుతున్న సుదర్శన్‌రెడ్డి తదితరులు

నల్లా మల్లారెడ్డి సిబ్బందికి ఇళ్ల పట్టాల పంపిణీ



దివ్యానగర్‌లో ఇళ్ల పట్టాలు అందజేస్తున్న చైర్మన్ మల్లారెడ్డి, సతీమణి సంధ్యవళి

ఘట్‌కేసర్: నల్లా మల్లారెడ్డి విద్యాసంస్థల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న హర్ష ఎస్టేట్ సూపర్‌వైజర్లు, మేస్త్రీలు, కళాశాల సిబ్బందికి నల్లా మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేతలు నల్లా మల్లారెడ్డి, సతీమణి కేతిరెడ్డి సంధ్యవళి మంగళవారం కాచవానిసింగారం దివ్యనగర్‌లో ఇళ్ల పట్టాలు అందజేశారు. మొత్తం 80 మందికి ఒక్కొక్కరి పేరుమీద 120 చదరపు గజాల నుంచి 250 చదరపు గజాల విస్తీర్ణం గల ప్లాట్లను సంబంధిత వ్యక్తుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యానగర్ ఏర్పడినప్పటి నుంచి పనిచేసి అభివృద్ధికి కృషి చేసిన వారి సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా రెండో దఫా ఇంటి పట్టాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో నల్లా మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్లు దివ్యా, స్నేహ, వైఎస్ ఎంపీపీ జంగమ్మ, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ గీత, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని నిలదీసిన కాలనీవాసులు

మేడ్చల్: ప్రతి వర్షాకాలంలో పట్టణంలోని తుమ్మ చెరువు నించి ప్రమాదకరంగా మారుతున్నా సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని పట్టణంలోని వినాయక్‌నగర్ కాలనీవాసులు, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మంత్రి మల్లారెడ్డిని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గురించి కిష్టాపూర్‌వాసులు సైతం మంత్రిని నిలదీశారు. మంత్రి మల్లారెడ్డి 12వ వార్డులో తుమ్మ చెరువు కట్ట సమీపంలో రోడ్డు ప్రారంభోత్సవానికి వెళ్లడంతో ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో చెరువు నిండగానే చెరువు కింద ఉన్న కాలనీల ప్రజలు భయాందోళనల మధ్య ఉండాల్సి వస్తోందని అన్నారు. చెరువును ఆక్రమించి ప్లాట్లు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, చెరువు అలుగు పూర్తిగా కబ్జా చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాల్వలు, అలుగులు పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. మంత్రిని నిలదీసిన వారిని పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లి పక్కకు పంపారు. కార్యక్రమంలో నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, టైలర్ రాజు, పాండుగుప్తా, ప్రతాప్, ఆంజనేయులు తదితరులున్నారు.

పెళ్లి వద్దని మందలించారని యువతి ఆత్మహత్య

ఘట్‌కేసర్: పెళ్లి విషయమై మందలించారని మనస్థాపం చెందిన ఓ యువతి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంకుషాపూర్ గ్రామానికి చెందిన నాగభవాని(18) నగరంలోని ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తుంది. వీరి తల్లిదండ్రులు దాదాపు 8 ఏళ్ల క్రితం ఏపీ నుంచి ఉపాధి కోసం వచ్చి అంకుషాపూర్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లి విషయమై తల్లిదండ్రులు మందలించారని సోమవారం రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయింది. రాత్రి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. తెల్లారే సరికి గ్రామానికి సమీపంలో రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుంటలో పడి వ్యక్తి గల్లంతు

మేడ్చల్‌రూరల్: స్నానానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావల్‌కోల్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం రావల్‌కోల్ గ్రామ శివార్లలో పలు రాష్ట్రాలకు చెందిన వారు నివాసం ఉంటూ పలు కంపెనీల్లో కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ నివాసానికి సమీపంలో ఉన్న రావల్‌కోల్ వాగు కుంటలో మంగళవారం సాయంత్రం స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. వర్షం కారణంగా నిలిపివేసిన పోలీసులు బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గల్లంతైన వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. కాగా గతనెల 28న ఓ వ్యక్తి అదే కుంటలో స్నానానికి వెళ్లి నీటిలో పడి మృతి చెందగా నెల రోజులు గడవకముందే మరో వ్యక్తి నీటిలో గల్లంతవ్వడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రావల్‌కోల్ వాగుకు సమీపంలో వ్యవసాయ భూమి ఉన్న ఓ వ్యక్తి వాగులో అక్రమంగా పెద్ద ఎత్తున తవ్వకాలు జరపడంతోనే ఆ గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

త్వరలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభిస్తాం

పోచారం: నారపల్లిలో నిర్మిస్తున్న జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని మంత్రి మల్లారెడ్డిచే ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో..

కీసర: నాగారం మున్సిపాలిటీలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యన్ పర్యటించారు. మున్సిపల్ పరిధిలో డ్రై రిసోర్స్ సెంటర్ (డీఆర్‌సీ), జంతు జనన నియంత్రణ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డితో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈఈ సుదర్శనం, రఘు తదితరులు పాల్గొన్నారు.



నారపల్లిలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



వెనక్కి రాలేక.. ముందుకు వెళ్లలేక..





రైల్వే బ్రిడ్జి కింద ఇరుక్కుపోయిన స్కూల్ బస్సు

మేడ్చల్: మేడ్చల్‌లో రైల్వే గేట్ వద్ద నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి కింద స్కూల్ బస్సు ఇరుక్కోవడంతో బస్సులో ఉన్న చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. మేడ్చల్–గిర్మాపూర్ రోడ్డులో పాత రైల్వే గేట్ వద్ద అధికారులు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం సాగుతూ అసంపూర్తిగా మిగిలిపోయింది. మేడ్చల్ మున్సిపల్ అధికారులు వాహనాల రాకపోకలకు తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. దాని మీదుగానే రాకపోకలు సాగుతున్నాయి. అటువైపు వెళ్లాల్సిన స్కూల్ బస్సు ఇరుక్కుపోయింది. వెనక్కి ముందుకు వెళ్లలేని స్థితిలో ఉండిపోవడంతో చిన్నారులు కొద్దిసేపు భయాందోళనకు గురయ్యారు. అనంతరం వారిని కిందకు దింపారు.

కాంగ్రెస్ గెలిస్తేనే సంక్షేమ పాలన

అల్వాల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పరిపాలన అందిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



మహిళల ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట



జవహర్‌నగర్‌లో డ్వాక్రా మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ మేకల కావ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి హాజరై డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.12 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఉపాధికి పెద్దపీట వేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళా చట్టాలు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. మహిళల కోసం ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రుణాలతో మహిళలు వ్యాపారాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చెందాలన్నారు. జవహర్‌నగర్‌లో డ్వాక్రా భవనం ఏర్పాటుకు 3 ఎకరాల స్థలం కేటాయించి విశాలమైన భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. డ్వాక్రా మహిళలు మృతి చెందితే వారికి బ్యాంక్ లోన్ మాఫీ చేసేందుకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడతానన్నారు. రాష్ట్రంలోనే జవహర్‌నగర్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మహిళా సంఘాల నాయకురాలు శోభారెడ్డి, బ్యాంకు అధికారులు, మున్సిపల్, మెప్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌ను మరింత అభివృద్ధి చేస్తాం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన మంగళవారం పర్యటించి 4, 5, 12, 13, 14, 15 వార్డుల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలో కౌన్సిలర్లు, చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకులు వార్డుల అభివృద్ధి కోసం పోటీపడి పనిచేస్తున్నారని అన్నారు. వారి పనితనంతో వార్డులు అభివృద్ధి దిశలో సాగుతున్నాయని తెలిపారు. 23 వార్డుల అభివృద్ధికి రూ.11.50 కోట్ల నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. నాయకులు, కౌన్సిలర్లు మరింత కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు ప్రియాంక మధుకర్ యాదవ్, శివకుమార్‌యాదవ్, గణేష్, నర్సింహస్వామి యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, దేవ, నాయకులు భాస్కర్‌యాదవ్, నందారెడ్డి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



12వ వార్డులో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆట పరికరాలు కావాలన్న గ్రామ సర్పంచ్ కావేరి విన్నపం మేరకు వీబీఐటీ కళాశాల యాజమాన్యం స్పందించింది. మంగళవారం పాఠశాలలో సర్పంచ్ చేతులమీదుగా ఆట పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, హెచ్‌ఎం రవి, వీబీఐటీ కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఘట్‌కేసర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఘట్‌కేసర్: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా అవసరం లేదన్న టీ పీసీసీ చీఫ్ ఎంపీ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఘట్‌కేసర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ మున్సిపల్, మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, అనుబంధ సంస్థల నేతలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసలు స్వరూపం బయటపడింది

మేడ్చల్‌రూరల్: రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ అధ్యక్షుడు రేవంత్ మాటలతోనే పార్టీ నిజ స్వరూపం బయటపడిందని బీఆర్ఎస్ అనుబంధ టీబీయూసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతులను పట్టించుకోలేదని స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచి వారికి ఉచితంగా 24గంటల విద్యుత్ అందిస్తుంటే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ పార్టీ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టిందన్నారు.

రేవంత్‌రెడ్డిపై మండిపడిన బీఆర్ఎస్ నేతలు

కీసర: రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయం కోసం 24 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తుంటే ఓర్వలేక టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 3 గంటలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరిపోతుందని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని నాగారం మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి విమర్శించారు. మంగళవారం నాగారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులను రాజులను చేసేందుకు కృషి చేస్తుంటే రేవంతర్‌రెడ్డి మాత్రం రైతులకు ఉచిత కరెంటు వద్దన్న రీతిలో మాట్లాడటం ఎంత వరకు సమంజసం అన్నారు. రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ నేతల తీరును గమనిస్తున్నారని, వారికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా



ఆటోడ్రైవర్ నాగరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానని బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చర్లపల్లి, ఈసీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నాగరాజును మంగళవారం ఆయన పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంతో ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహించడంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సామాజిక సేవాభావనతోనే ఆపదలో ఉన్న పేదలకు చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో వ్యాన్ డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నబి, ఉపాధ్యక్షుడు సారయ్యయాదవ్, సతీష్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, అశ్విన్‌రాజ్, బాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.